

బాలాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న సినీతార కీర్తి సురేశ్

## బాలాపూర్‌లో సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

బడంగ్‌పేట, అక్టోబర్ 1 : సినీతార కీర్తి సురేశ్ బాలాపూర్‌లో సందడి చేసింది. ఆదివారం బాలాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్ మాల్స్‌ను కీర్తి సురేశ్ ప్రారంభించింది. తనకు నచ్చిన వస్త్రాలను ధరించి ఆనందం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరలో అన్ని రకాల వస్త్రాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధినేత శ్రీ అల్లక సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



## ఉత్సాహభరితంగా.. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం

● పాల్గొన్న నటి అమల, గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ

సిటీబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ ): జాతిపిత మహాత్మా గాంధీ జయంతి అక్టోబర్ 2 సందర్భంగా ఆదివారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జీహెచ్ఎంసీ నగర వ్యాప్తంగా అన్ని వార్డులలోని వల్నార బుల్ పాయింట్లు వద్ద (జీవీపీ) అధికారులు స్వయంగా రోడ్లను క్లీన్ చేశారు. చెత్తను స్వచ్ఛ వెహికల్ ద్వారా సెకండరీ కలెక్షన్ పాయింట్‌కు తరలించారు. ఈ సందర్భంగా ప్రసాద్ ఐ మాక్స్ థియేటర్ వద్ద స్వచ్ఛతాహి సేవలో సినీ నటి అక్కినేని అమల, ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ , జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, జోనల్ కమిషనర్ వెంకటేశ్ దొత్రే ఏఎంఓహెచ్ భార్గవ్ నారాయణ, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు. బి ది ఛేంజ్, క్లీన్ అండ్ గ్రీన్ సిటీలో భాగంగా వీరంతా ప్రసాద్ ఐ మాక్స్ థియేటర్ వద్ద చీపురుతో రోడ్లను క్లీన్ చేయడం, చెత్త ఏరివేత, చెత్త కుప్పలను బ్యాగులలో వేశారు. స్వచ్ఛ వెహికల్స్ ద్వారా చెత్తను కలెక్షన్ ట్రాన్స్‌ఫర్ పాయింట్లకు తరలించారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్ మంగ తాయారు, ఏడీ వెటర్నరీ సద్గుణ తదితర అధికారులు పాల్గొన్నారు.

## గాంధీజీ కలలు నెరవేరుద్దాం

### కలెక్టర్ హరీశ్

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 1: గాంధీజీ కలలుగన్న స్వచ్ఛమైన భారతదేశం నిర్మాణంలో స్వచ్ఛతా మాసోత్సవాలు ముఖ్య భూమిక పోషిస్తాయని కలెక్టర్ హరీశ్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా మున్సిపల్ ఆధ్వర్యంలో ఆదివారం శంషాబాద్ బస్టాండ్ సమీపంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) ప్రతిమా సింగ్, మున్సిపల్ కమిషనర్‌తో కలిసి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ.. స్వచ్ఛతా హీ సేవా గొప్ప కార్యక్రమం అని అన్నారు. మన ఇంటిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.



# దళితుల సాధికారతలో జలమండలి ముందంజ..!

ఇప్పటికే సీవర్ జెట్టింగ్ యంత్రాలతో యాజమానులైన కార్మికులు

- తాజాగా.. మరో 162 మందికి మేలు
- నేడు మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా మురుగు వ్యర్థాల రవాణా వాహనాల అందజేత
- ఉద్యోగ, ఉపాధి.. ఒక్కో వాహనంపై రూ.90 వేల ఆదాయం





సిటీబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): దళితుల సాధికారతలో జలమండలి తనవంతు పాత్ర పోషిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకంలో భాగంగా జలమండలి లబ్ధిదారులకు 162 మురుగు వ్యర్థాల రవాణా వాహనాలను అందిస్తున్నది. మురుగు వ్యర్థాల తరలింపు వాహనాల పంపిణీ ప్రక్రియను సోమవారం గాంధీ జయంతి రోజున హుస్సేన్‌సాగర్ తీరంలోని భారీ అంబేద్కర్ విగ్రహం ఎదుట మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు. దళిత కుటుంబాలకు జీవనోపాధి కల్పించడం, నగరాన్ని మరింత పరిశుభ్రంగా ఉంచేందుకు సిల్ట్ కార్టింగ్ (మురుగు వ్యర్థాల రవాణా) వాహనాలు ముఖ్య ఉద్దేశమని జలమండలి ఎండీ దానకిశోర్ తెలిపారు. జలమండలి గతంలోనూ ఇలాంటి చర్యలు చేపట్టిందని, 2017లో ప్రవేశపెట్టిన సీవర్ జెట్టింగ్ యంత్రాలతో పలువురు కార్మికులను యజమానులను చేసిందని ఎండీ గుర్తు చేశారు. ఈ వాహనాలను తీసుకోవడం వల్ల లబ్ధిదారుడు యజమానిగా ఉంటూ.. మరోవైపు డ్రైవర్‌గా కూడా ఉపాధి పొందుతున్నాడని తెలిపారు. ప్రతి వాహనానికి ఇద్దరు మజ్దూర్లు కావాల్సి ఉన్నందున.. ఆ కుటుంబంలోని వారే ఇద్దరు కార్మికులుగా కూడా ఉపాధి పొందే వీలు ఉంటుందన్నారు.

**నాలుగు జిల్లాల లబ్ధిదారులు.. 162 వాహనాలు**

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాలకు సంబంధించిన 162 మందిని అధికారులు ఎంపిక చేశారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ సంబంధిత ఎమ్మెల్యేల ఆమోదం మేరకు ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో జరిగింది. వీరందరికీ ఒక్కో వాహనం చొప్పున 162 వాహనాలను అందిస్తున్నారు. ఈ లబ్ధిదారులకు వీటిపై గత నెల 26న అవగాహన కల్పించారు. జలమండలి పరిధిలో ఉన్న 162 సెక్షన్లలో.. సెక్షన్‌కు ఒకటి చొప్పున వీటిని కేటాయించనున్నారు. వాటి పరిధిలోనే వీరు పనిచేయాల్సి ఉంటుంది.

**జిల్లాల వాహనాల సంఖ్య**

| జిలా | వాహనాలు |
|---|---|
| హైదరాబాద్ | 88 |
| రంగారెడ్డి | 35 |
| మేడ్చల్– మల్కాజిగిరి | 37 |
| సంగారెడ్డి | 02 |
| మొత్తం | 162 |

### మరిన్ని సేవలందించేందుకు..

నగరంలో పారిశుద్ధ్య నిర్వహణకు జలమండలి ఇప్పటికే అనేక చర్యలు చేపట్టింది. మ్యాన్‌హోల్ శుభ్రం చేసిన తర్వాత అందులో నుంచి తీసిన వ్యర్థాలు (సిల్ట్) ఎప్పటికప్పుడు అక్కడి నుంచి తొలగించేందుకు నూతన వాహనాలను తీసుకువచ్చింది. వీటిని మురుగు వ్యర్థాల రవాణా (సిల్ట్ కార్టింగ్) వాహనాలు అంటారు. వీటిని దళితులకు అందజేయడం, వారి కుటుంబాలకు మేలు జరుగుతుందని ప్రభుత్వం భావించింది. ఈ వాహనాల ద్వారా మ్యాన్‌హోల్స్ వద్ద సిల్ట్‌ని ఎప్పటికప్పుడు తొలగించి మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు వీలవుతుంది.

**కలిగే ప్రయోజనాలు..**

- జాబ్ గ్యారెంటీ పద్ధతిలో ప్రతి సిల్ట్ కార్టింగ్ వాహనానికి జలమండలి పని కలిపిస్తుంది.
- చెత్తను తొలగించి నిర్దేశించిన స్థానానికి రవాణా చేయడానికి నెలవారీ ప్రాతిపదికన అద్దె చార్జీలు చెల్లిస్తుంది. దీంతో పాటు లేబర్, నిర్వహణ ఖర్చులను సైతం జలమండలే చెల్లిస్తుంది.
- ఏఎంసీ నిబంధనల ప్రకారం.. వాహనాలు ఎప్పటికప్పుడు మంచి కండీషన్‌లో ఉండడానికి వారికి ప్రతి మూడు మాసాలకు ఒకసారి వెహికల్ చెకింగ్, సర్వీస్ చార్జీలను వాహన నిర్మాణ సంస్థకు చెల్లిస్తుంది.
- ఇందులో ప్రతి వాహనానికి ఒక డ్రైవర్ సహా ఇద్దరు సహాయకులు ఉంటారు. ఈ వాహనాలకు లబ్ధిదారులు కుటుంబ సభ్యులే. డ్రైవర్, సిబ్బందికి కలిసి నెలకు సుమారుగా రూ.1.20 లక్షల ఆదాయం వస్తుంది. విధి నిర్వహణలో ధరించే బూట్లు, యూనిఫాం, హెల్మెట్, గ్లౌజ్ వంటి రూ.3వేల విలువజేసే భద్రతా పరికరాలను జలమండలే అందిస్తున్నది.

**వాహన నిర్వహణ వివరాలు (నెలకు)**

దళిత బంధు కింద తీసుకునే మురుగు వ్యర్థాల తరలింపు వాహనానికి జలమండలి ద్వారా జరిగే చెల్లింపుల ప్రక్రియ ఇలా ఉంటుంది.

**(ఒక్కో వాహనానికి ఇలా)**

వాహనానికి అద్దె చార్జీ – రూ.23,150

డ్రైవర్ – రూ.27,090

మజ్దూరు (కార్మికులు) ఇద్దరు – రూ.43,680 (ఒక్కరికి రూ.21,840 చొప్పున)

డీజిల్ ఖర్చు (రోజుకి 8 లీటర్లు) రూ. 21, 840

లుబ్రికెంట్ రూ. 1000

ఇన్సూరెన్స్ రూ. 2,500

ఇతర ఖర్చులు రూ. 740

మొత్తం.. రూ.1.20 లక్షలు


162 వాహనాలకు ఒక నెలకు కలిపి రూ.1.94 కోట్లు ఖర్చు కాగా.. సంవత్సరానికి రూ.23.33కోట్లు అవసరమవుతాయి.

**ఏడాదికి రూ.10 లక్షల పైనే..**

దళితబంధు పథకంలో భాగంగా ఒక్కో యూనిట్ కింద రూ.10 లక్షల చొప్పున ఇవ్వనున్నందున రూ.16.20 కోట్లతో 162 మందికి ఈ వాహనాలను ఇస్తున్నారు. ఒక్కో వాహనం ఖరీదు రూ.9.50 లక్షలు కాగా.. రిజిస్ట్రేషన్, ఇతరత్రా ఖర్చుల కింద రూ.50వేల చొప్పున లబ్ధిదారులకు అందిస్తున్నారు. 162 వాహనాలను అద్దెకు తీసుకోవడం ద్వారా వాటికి జరిగే చెల్లింపులు, లబ్ధిదారుడికి వచ్చే ఆదాయం, నిర్వహణ వ్యయం ఇలా అన్ని కోణాల్లో జలమండలి అధికారులు ప్రాజెక్టు వివరాలను రూపొందించారు. దాని ప్రకారం ఒక్కో వాహనానికి జలమండలి నెలకు రూ.1.20 లక్షలు చెల్లించనున్నది. ఇందులో నిర్వహణ వ్యయం పోగా.. ఒక్కో దళిత కుటుంబానికి రూ.90వేలకు పైగా (ఆ కుటుంబంలోని వారే డ్రైవరు, కార్మికులుగా పని చేస్తే) ఆదాయం వస్తుంది. అంటే.. ఏడాదికి ఒక్కో కుటుంబ ఆదాయం సుమారు రూ.పది లక్షలకు పైగానే ఉంటుంది.

## బెయిల్‌పై వచ్చి.. బలవన్మరణం

### భార్య, బిడ్డను చంపిన కేసులో నిందితుడి ఆత్మహత్య



ధన్‌రాజ్ (ఫైల్)

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 1: ఆరున్నర నెలల కిందట అనుమానంతో బాలింత అనే కనికరం లేకుండా భార్యను గొడ్డలితో నరికి, నెలన్నర వయసున్న.. కన్న బిడ్డను సంపులో పడేసి హతమార్చిన తండ్రి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన ఏర్పుల ధన్‌రాజ్(32) ఆదివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు.

**ఈ ఏడాది మార్చిలో..**

అనాజ్‌పూర్‌కు చెందిన ధన్‌రాజ్‌కు లావణ్యతో వివాహం జరిగింది. వీరికి రెండేండ్ల కూతురు, నెలన్నర పసికందు ఉన్నారు. ఈ ఏడాది మార్చిలో భార్య లావణ్యపై ధన్‌రాజ్ అనుమానం పెంచుకున్నాడు. నెలన్నర బిడ్డ తనకు పుట్టలేదనే అనుమానంతో లావణ్యను గొడ్డలితో నరికి చంపేశాడు. నెలన్నర పసికందును సంపులో పడేశాడు. ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో రెండేండ్ల చిన్నారి ఏడుస్తూ పరుగులు తీయడంతో ప్రాణాలతో బయటపడింది. ఆ చిన్నారిని లావణ్య తల్లిదండ్రులు తీసుకెళ్లారు. ఈ కేసులో ధన్‌రాజ్ జైలు పాలయ్యాడు. రెండు నెలల కిందట ధన్‌రాజ్ బెయిలుపై బయటకొచ్చి.. తన సోదరి వద్ద ఉన్నాడు. ఇటీవలే అనాజ్‌పూర్‌కు పని కోసం వచ్చాడు. ఈ నేపథ్యంలో ఆదివారం తండ్రి బాలయ్య ఉదయం పనికి వెళ్లగా.. ధన్‌రాజ్ ఇంట్లోనే ఉన్నాడు. మధ్యాహ్నం బాలయ్య తిరిగి రాగా.. ధన్‌రాజ్ ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు.

**క్షణికావేశంతో ఒంటరై..**

భార్య, బిడ్డను చంపుకుని ధన్‌రాజ్ పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం.. రెండేండ్ల చిన్నారికి తండ్రి కూడా దూరమయ్యాడు.